

ఇళ్లు, రోడ్లకు రైతుభరోసా

అధికారులు నిర్వహించిన రైతు భరోసా సర్వే కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా ఉంది.
వివరాలు 8లో ▸



వ్యక్తి దారుణహత్య

వ్యక్తి దారుణహత్యకు గురైన సంఘటన శివ్వంపేట మండల పరిధిలో జరిగింది.
వివరాలు 8లో ▸



ఖజానా దూరం.. తప్పని భారం

ఖజానా కార్యాలయం అందుబాటులో లేక ఉద్యోగులు, కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు.
వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

సైబర్ నేరగాళ్లతో జర భద్రం

ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి



మెదక్ మున్సిపాలిటీ: లోన్ యాప్ ద్వారా అప్పు ప్రాణాలకే ముప్పు తెస్తుందని, సైబర్ నేరగాళ్లతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన మాట్లాడు తూ.. ప్రస్తుతం అనేక రకాలుగా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారని వివరించారు. అధిక లాభాల కోసం ఆశపడి ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెట్టవద్దని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే యాడ్స్ చూసి మోసపోవద్దని హెచ్చరించారు. ఎవరైనా కొత్త వ్యక్తులు క్యూఆర్ కోడ్ పంపించి దానిని స్కాన్ చేస్తే మీకు డబ్బులు వస్తాయని చెప్తే నమ్మవద్దన్నారు. ఆన్‌లైన్ యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసినప్పుడు ఫోన్ నంబర్లు, ఫొటోలు, వ్యక్తిగత వివరాలు యాప్ నిర్వాహకులు తీసుకొని వేధింపులకు గురిచేస్తారని వివరించారు. ఇబ్బందులు ఎదురైతే 1930 లేదా డయల్ 100 సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు.

నేడు నర్సాపూర్‌లో కాంగ్రెస్ నిరసన

నర్సాపూర్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం నర్సాపూర్‌లో నిర్వహించ తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించకుండా అన్యాయం చేసిందని మండిపడ్డారు. అందుకే నిరసన కార్యక్రమం చేపట్టామని, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న శ్రీజ

పాపన్నపేట(మెదక్): హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి స్టార్ జూనియర్ అబాకస్ పోటీల్లో పాపన్నపేట శ్రీవిద్య స్కూల్ విద్యార్థిని శ్రీజ సత్తా చాటింది. పోటీల్లో 600 పాఠశాలలకు చెందిన 780 విద్యార్థులు పాల్గొన్నారు. స్టార్ జూనియర్ విభాగంలో 71 పాఠశాలల నుంచి, 142 మంది పరీక్ష రాయగా, అందులో శ్రీజ మొదటి స్థానం సాధించిందని ప్రిన్సిపాల్ రవీందర్ తెలిపారు.

ఏసయ్యా.. కరుణించు..



ప్రార్థనలో భక్తులు

మెదక్‌జోన్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. కాగా ఉదయం మతగురువు డేవిడ్ రిచర్డ్ భక్తులనుద్దేశించి దైవసందేశం ఇవ్వగా.. మధ్యాహ్నం ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య దైవ సందేశం ఇచ్చారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

సంప్రదాయ రచనలు అవసరం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సమాజానికి సంస్కృతి, సంప్రదాయ రచనలు ఎంతో అవసరమని జాతీయ సాహిత్య పరిషత్ (జాసాప) రాష్ట్ర అధ్యక్షుడు వడ్లూరి ఆంజనేయరాజు అన్నారు. ఆదివారం సిద్దిపేటలో జరిగిన జాసాప 38వ వార్షికోత్సవంలో మాట్లాడుతూ యువ కవులు సాహిత్య రచనలు చేయడంలో ముందుకు రావాలన్నారు. సాహిత్యం ద్వారా సమాజంలోని రుగ్మతలు తొలగించవచ్చన్నారు. జాసాప రాష్ట్ర ఉపాధ్యక్షులు గాజుల రవీందర్ మాట్లాడుతూ ప్రతి రచయిత రచనలు జనుల హృదయాలలో చోటు చేసుకునేలా ఉండాలంటూ, దేశం జాగృతమయ్యేలా సాహిత్యం ముందుకు సాగాలన్నారు. మన చరిత్రను మనం కాపాడుకోవల్సిన అవసరం ఉందన్నారు. ధర్మ రక్షణార్థమై రచనలు చేయాలన్నారు. వార్షికోత్సవం సందర్భంగా తడకమడ్ల సంప్రదాయ సాహితీ పురస్కారం – అవధాని అవుసుల భానుప్రకాష్ (మేడ్చల్)కు, ఐతా భారతి చంద్రయ్య సంప్రదాయ కథా పురస్కారం కూర చిదంబరం (హైదరాబాద్)కు, ఎన్నవెల్లి బాలసాహిత్య పురస్కారం గరిపల్లి అశోక్ (సిద్దిపేట)కు నగదు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

బాలికలకు అండగా..





నర్సాపూర్ బీసీ వెల్ఫేర్ స్కూల్‌లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి (ఫైల్)

రక్షణ మెండుగా..
- 'బేటీ బచావో.. బేటీ పడావో'కు పదేళ్లు
- మార్చి 8 వరకు వివిధ కార్యక్రమాలు

మెదక్‌జోన్: లింగ వివక్షతను రూపుమాపి, మహిళా సాధికారతను సాధించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 2015 జనవరి 15న బేటీ బచావో.. బేటీ పడావో (ఆడ పిల్లలను రక్షించండి.. ఆడపిల్లలను చదివించండి) అనే పథకాన్ని ప్రారంభించింది. అయితే పథకం ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా బాలికల సంరక్షణ, స్త్రీ సాధికారత, లింగ వివక్షకు వ్యతిరేకంగా జిల్లాలో పౌరులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

చట్టాలు.. శిక్షలు

జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో గత నెల 27 నుంచి ప్రారంభమైన కార్యక్రమాలు మార్చి 8వ తేదీ వరకు కొనసాగనున్నాయి. బాలికల చట్టాలు, లింగవివక్ష, విద్యాలయాల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్.. తదితర అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఇబ్బందులు ఎదురైతే 181 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. ఇందుకోసం విద్యాశాఖ అధికారులతో చర్చిస్తున్నారు. అలాగే బాల్య వివాహాలు చేసినా, స్త్రీలను లైంగికంగా హింసించినా, వరకట్న వేధింపులకు గురిచేసినా, లింగ నిర్ధారణ చేసినా, గర్భంలోనే ఆడపిల్లను అంత మొందించినా.. చట్టపరంగా ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యాబుద్ధులు చెప్పాల్సిన గురువులు బాలికలను బ్యాడ్ టచ్ చేసినా, ఎలాంటి శిక్ష ఉంటుందనే దానిపై జిల్లా సాధికారత కేంద్రం, లీగల్ సెల్ అథారిటీ (న్యాయశాఖ) ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపడుతు న్నారు. కళాశాలలు, పాఠశాలల్లో తోటి విద్యార్థినులను లైంగికంగా వేధిస్తే జరగబోయే పరిణామాలు, అందుకు పడే శిక్షల గురించి బాలురకు న్యాయ నిపుణులతో సమగ్రంగా వివరిస్తున్నారు.

బాలికలు తక్కువ.. బాలురు ఎక్కువ

జిల్లావ్యాప్తంగా 6 ఏళ్ల లోపు బాలికలు 45,627 మంది ఉండగా, బాలురు మాత్రం 48,247 మంది ఉన్నారు. ఈ లెక్కన బాలికల కంటే బాలురు 2,620 మంది అధికంగా ఉన్నారు. 18 ఏళ్ల వయసు వరకు పరిశీలిస్తే బాలికల కంటే బాలురు సుమారు 10 వేల పైచిలుకు అధికంగా ఉన్నారని తెలిసింది.

విస్తృతంగా అవగాహన



బేటీ బచావో.. బేటీ పడావో పథకం ప్రారంభమై పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో మార్చి 8వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జిల్లా మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో వివిధ శాఖల సమన్వయంతో కళాశాలలు, కేజీబీవీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. అలాగే లీగల్‌సెల్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయమూర్తులతో అవగాహన కల్పిస్తున్నాం.

– సంతోషి, జిల్లా మిషన్ కో ఆర్డినేటర్

అమలు కాని హామీలతో మోసం



ఎల్లమ్మ ఆలయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు

మాజీ మంత్రి హరీశ్‌రావు

కౌడిపల్లి(నర్సాపూర్): కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని హామీలతో ప్రజలను మోసం చేసిందని.. చిత్త శుద్ధి ఉంటే అన్ని పథకాలు అమలు చేసి జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు వెళ్లాలని మాజీ మంత్రి హరీశ్ రావు సవాల్ విసిరారు. ఆదివారం మండలంలోని తిమ్మాపూర్‌లో రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలకు ఎమ్మెల్యే సునీతారెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో అన్ని పథకాలు అమలు చేస్తామని చెప్పిందన్నారు. 420 రోజులు అయిన రుణమాఫీ కాలే, రైతుబంధు రాలేదన్నారు. గౌడ కులస్తులపై ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతూ కేసులు పెట్టిస్తుందన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ప్రజలు అడగకుండానే సంక్షేమ పథకాలు అమలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ సార రామాగౌడ్, మాజీ ఎంపీటీసీలు శంకర్‌గౌడ్, కిషోర్‌గౌడ్, నాయకులు మన్సూర్, చంద్రాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్య రంగాన్ని విస్మరించిన కేంద్రం

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగాన్ని విస్మరించారని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. ఆదివారం సిద్దిపేటలో శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రానికి కేటాయింపులు లేకపోవడంపై బీజేపీ వివక్ష మరోసారి బహిర్గతమైందన్నారు. బడ్జెట్‌లో విద్యారంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ వికసిత్ భారత్, పేదరికం నిర్మూలనే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని ప్రకటించి బడ్జెట్ కేటాయింపుల్లో మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరించారని ఆరోపించారు. విద్య రంగానికి తగినంత నిధులను కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్లు తెలిపారు.

అన్నివర్గాలకూ సమన్యాయం

ములుగు(గజ్వేల్): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతోందని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి అన్నారు. ఆదివారం బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు యువకులు నర్సారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తూ ముందుకు సాగుతోందన్నారు.

● మల్లన్న క్షేత్రం.. భక్తజనసంద్రం



రాజగోపురం ఎదుట భక్తుల సందడి

కొమురవెల్లి(సిద్దిపేట): కోరమీసాల మల్లన్న స్వామి.. కోటి దండాలు..అంటూ భక్తులు ప్రణమిల్లారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడో ఆదివారం కొమురవెల్లి మల్లన్న క్షేత్రానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలన్నీ సందడిగా మారాయి. తెల్లవారు జామునుంచే భక్తులు తలనీలాలు సమర్పించి, పుష్కరిణిలో స్నానమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు బోనాలతో డప్పుచప్పుళ్లతో ఆలయానికి చేరుకుని స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అదనపు డీసీపీ మల్లారెడ్డి ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఏడుపాయలలో భక్తుల సందడి



క్యూలైన్‌లో భక్తులు



అమ్మవారి సన్నిధిలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పాపన్నపేట(మెదక్): ఎల్లలు దాటివచ్చిన భక్తులతో ఏడుపాయల జనారణ్యంగా మారింది. ఆదివారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, రాష్ట్ర ట్రైబర్ వెల్ఫేర్ కార్యదర్శి డాక్టర్ శరత్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి అర్చకులు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో అందుకనుగుణంగా పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్, ఈఓ చంద్రశేఖర్, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

వర్గల్‌కు 'వసంత' శోభ

విద్యాసరస్వతి సన్నిధిలో భారీగా అక్షర స్వీకారాలు

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధ వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రం వసంత శోభను సంతరించుకుంది. ఆదివారం వారాంతపు సెలవు కావడం, పంచమి తిథి కలిసిరావడంతో భక్తులు పోటెత్తారు. వసంతపంచమి మహోత్సవం ముందురోజే అక్షరదేవత సన్నిధానం భక్తులతో నిండిపోయింది. భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సోమవారం వసంత పంచమి మహోత్సవ వేడుకలు తెల్లవారుజాము నుంచే మొదలవుతాయని ఆలయవ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరసిద్ధాంతి తెలిపారు. చిన్నారుల అక్షరాభ్యాసాలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామన్నారు.



విశేషాలంకరణలో వర్గల్ అమ్మవారు



చిన్నారుల అక్షరాభ్యాసాలు

రోగులకు అందుబాటులో ఉండాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

రామాయంపేట(మెదక్): వైద్యులు 24 గంటల పాటు అందుబాటులో ఉండి రోగులకు వైద్య సేవలందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. ఆదివారం ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలని, ఎప్పటికప్పుడు మందుల నిల్వలు పెట్టుకోవాలని సూచించారు. రోగులకు రుచికరమైన, బలవర్ధకమైన అహారం అందజేయాలన్నారు. గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. అంతకుముందు ఆస్పత్రిలో రికార్డులు, ల్యాబ్, మందులు నిల్వ చేసే స్టోర్ రూంను పరిశీలించారు. ఏమైనా సమస్యలున్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. హెడ్‌నర్సుతో పాటు కొందరు సిబ్బంది విధుల్లో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- తొలిసారి సీసీ కెమెరాల పర్యవేక్షణలో..
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఇంటర్ విద్యాశాఖ



మెదక్‌జోన్: ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 3 నుంచి 20వ తేదీ వరకు జరగనున్నాయి. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఇంటర్ విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మాస్ కాపీయింగ్‌ను అరికట్టడంలో భాగంగా ఈసారి గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రాక్టికల్ పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించనుంది. పరీక్షల నిర్వహణను ఇంటర్ బోర్డు అధికారులు పర్యవేక్షించనున్నారు.

ప్రతీ కళాశాలలో రెండు సీసీ కెమెరాలు

జిల్లాలో మొత్తం 59 జూనియర్ కళాశాలలు ఉండగా, 16 ప్రభుత్వ, 10 ప్రైవేట్, 33 సెక్టోరియల్ కళాశాలలు ఉన్నాయి. మొదటి సంవత్సరంలో 6,066, ద్వితీయ సంవత్సరంలో 6,418 కలిపి మొత్తం 12,484 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కాగా అన్ని కళాశాలలకు సంబంధించి మొత్తం 7,840 మంది విద్యార్థులు ప్రయోగ పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రాక్టికల్ పరీక్షల నేపథ్యంలో ప్రభుత్వ కళాశాలల్లో రెండు సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రభుత్వం రూ. 12 వేలు విడుదల చేసింది. రెండు కెమెరాలలో ఒకటి ల్యాబ్ లోపల, మరో కెమెరాను ప్రవేశద్వారం దగ్గర ఏర్పాటు చేశారు. దీంతో ప్రయోగ పరీక్షల జరిగే సమయంలో వీడియోతోపాటు ఆడియో కూడా రికార్డు కానుంది.

ప్రశ్నపత్రాలు ఆన్‌లైన్‌లో..

ప్రాక్టికల్స్‌కు సంబంధించిన ప్రశ్న పత్రాలను ఏరోజుకారోజు ఇంటర్‌బోర్డు ఆన్‌లైన్‌లో పొందుపరచనుంది. ఈ ప్రశ్న పత్రాలకు సంబంధించి అరగంట ముందుగానే కళాశాల ప్రిన్సిపాల్ లాగిన్‌కు మెయిల్ వస్తుంది. దాని ప్రకారం ప్రశ్న పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకుని ప్రింట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఆ ప్రింట్ తీసుకున్న ప్రశ్న పత్రాన్ని విద్యార్థులకు అందజేస్తారు. ప్రశ్న పత్రాలను మాత్రమే సీసీ కెమెరా పర్యవేక్షణలో ఓపెన్ చేసేవారు. కాగా, ఈ ఏడాది ప్రయోగాలను కూడా సీసీ కెమెరాల పర్యవేక్షణలో చేయాల్సి ఉంటుంది.

బందీ అవుతున్న బాల్యం



ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా ఓ స్వీట్‌హౌస్‌లో అధికారుల తనిఖీలు (ఫైల్)

- జిల్లాలో 122 మంది బాలకార్మికుల గుర్తింపు
- ఎన్ని కౌన్సెలింగ్‌లు ఇచ్చినా ప్రయోజనం శూన్యం
- పేదరికమే ప్రధాన కారణం

మెదక్ కలెక్టరేట్: పాఠశాలలకు వెళ్లి అక్షరాలు దిద్దాల్సిన వారు బాల కార్మికులుగా మారి అగాధంలో కూరుకుపోతున్నారు. బంగారు భవిష్యత్ ఉన్న చిన్నారులు పేదరికాన్ని తట్టుకోలేక హోటళ్లు, బేకరీలు, బట్టలు, కిరాణా, మెకానిక్ షాపులు, ఇటుక బట్టీల్లో పనిలో చేరి కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. గతేడాది జనవరి, ఆగస్టు నెలలో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ ద్వారా 126 మంది బాల కార్మికులను అధికారులు గుర్తించారు. కానీ ఈ ఏడాది జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో 122 మందిని గుర్తించారు. ఈ లెక్కన జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ ఎంతగా పెరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

బాల్యానికి 'బంధం'

2024లో జిల్లావ్యాప్తంగా అధికారులు 28 బాల్య వివాహాలను అడ్డుకొని నిలిపివేశారు. పేదరికం, నిరక్షరాస్యత, మూఢ నమ్మకాలు కారణంగా బాల్యంలోనే బంది చేస్తున్నారు. మారుమూల గ్రామాలు, గిరిజన తండాల్లో బాల్య వివాహాలు అత్యధికంగా జరుగుతున్నాయి. కొంతమంది తల్లిదండ్రులు ప్రస్తుతం ఉన్న సామాజిక మాధ్యమాలు, సెల్‌ఫోన్లు, సినిమాలతో పిల్లలు తప్పుదారి పడతారన్న భయంతో పెళ్లి చేస్తున్నారు. అయితే బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 1098కు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు.

కమిటీల ఏర్పాటు

బాల్య వివాహాలను అరికట్టేందుకు పోలీసులు, వైద్యశాఖ అధికారులతో కలిసి ప్రజలకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టేందుకు గ్రామ, మండల, జిల్లాస్థాయి కమిటీలు ఉన్నాయి. ఇందులో ఆశ, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, యూత్ సభ్యులు కమిటీ సభ్యులుగా ఉన్నారు. వీరు ఎక్కడైన బాల్య వివాహాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తారు. వారు పెళ్లిని అడ్డుకొని ఇరువర్గాల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తారు.

28 మందిపై కేసులు



గత నెలలో జిల్లావ్యాప్తంగా ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ద్వారా 122 మంది బాల కార్మికులను గుర్తించాం. బడీడు పిల్లలను పనిలో పెట్టుకున్న 28 మంది యజమానులపై కేసులు నమోదు చేశాం. పిల్లల తల్లిదండ్రులు, యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలను బడికి పంపించాం. ఇతర రాష్ట్రాల పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించాం.

– కరుణశీల, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారిణి

క్లుప్తంగా

రాయపోల్‌ విద్యార్థినికి గోల్డ్‌ మెడల్‌



గోల్డ్‌ మెడల్‌ అందుకుంటున్న మానస

దుబ్బాకటౌన్‌: బీటెక్‌ ఫుడ్‌ టెక్నాలజీలో రాయపోల్‌కు చెందిన విద్యార్థి గల్వ మానస గ్రాడ్యుయేట్‌ పట్టాతో పాటు గోల్డ్‌ మెడల్‌ సాధించి ప్రశంసలు అందుకుంది. చెన్నైలోని మధురై కళాసాలింగం యూనివర్సిటీ 37వ స్నాతకోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో యూనివర్సిటీ వీసీ చేతుల మీదుగా పట్టా, గోల్డ్‌ మెడల్‌ను అందుకుంది. దీంతొ ఆమెను పలువురు అభినందించారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



తప్పిపోయిన బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న పోలీసులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి తల్లిదండ్రులతో వచ్చి తప్పిపోయిన ఒ బాలుడిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించింన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్‌ మండలం చాగల్లు గ్రామానికి చెందిన ప్రవీణ్‌ తన కుటుంబ సభ్యులతో కలసి ఆదివారం మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చారు. ఈ క్రమంలో తన మూడేళ్ల బాబు హర్షవర్ధన్‌ తప్పిపోయాడు వెంటనే పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు వెతికి పట్టుకొని బాబును తల్లిదండ్రులకు అప్పగించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గజ్వేల్‌రూరల్‌: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన శ్రీగిరిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పొట్ట ఆనంద్‌(39)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆనంద్‌ మద్యానికి బానిస కావడంతో కుటుంబంలో కలహాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో గత నెల 29న ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం ఆర్‌వీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి..



మెదక్‌ మున్సిపాలిటీ: ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. మెదక్‌ పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో 35యేళ్ల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటంతో పోలీసులు అతన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచినట్లు తెలిపారు. మృతుడి ఛాతీపైన అమ్మ నాన్న అంటూ లవ్‌ సింబల్‌లో పచ్చబొట్టు ఉంది. తెల్లని బనియన్‌ ధరించి ఉన్నాడు. ఎవరైనా ఇతడిని గుర్తు పట్టినా.. లేదా కుటుంబ సభ్యులు ఫోన్‌ నంబర్లు 87126 57913, 87126 57914కు సంప్రదించాలని పోలీసులు కోరారు.

62 మందిపై డ్రంకెన్‌ డ్రైవ్‌ కేసులు

సిద్దిపేటకమాన్‌: కమిషనరేట్‌ పరిధిలో ఆదివారం రాత్రి పోలీసులు స్పెషల్‌ డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 62 మందిపై డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ కేసులు నమోదు చేసినట్లు సీపీ అనురాధ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇళ్లు, రహదారులకూ రైతు భరోసా!

- పేదలకు కోతలు, పెద్దల మేడలకు భరోసా
- సాగు భూముల సర్వేలో అధికారుల విఫలం
- క్లస్టర్‌ పరిధిలో లెక్కలు తెలపని ఏఈఓలు
- తోటపల్లిలోనే 30 ఎకరాలకు వృథా



రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన సిమెంట్‌ బ్రిక్స్‌ పరిశ్రమ

రైతు భరోసా నిధులు దుర్వినియోగం కాకూడదనే లక్ష్యంతో సాగుకు యోగ్యంకాని భూములను గుర్తించడానికి ప్రభుత్వం సర్వే చేయించింది. అధికారులు మాత్రం గ్రామాల్లో ఒక దగ్గర కూర్చొని తప్పుడు సర్వేచేసి మండలంలో 1180 ఎకరాలు సాగుకు యోగ్యంకాని భూములు ఉన్నట్లు నివేదికలు రూపొందించారు.

– హుస్నాబాద్‌రూరల్‌:

చిన్న, సన్నకారు రైతులకు ఒక్కొక్క సర్వే నంబరులో 0.5 నుంచి 10 గుంటల వరకు ఉన్న భూములకు రైతు భరోసాలో కోత విధించారు. బడా బాబులు వ్యవసాయ భూమిలో 10 గుంటల విస్తీరణంలో ఇల్లు నిర్మించినా వారికి రైతు భరోసా ఇవ్వడంపై పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా అధికారులు సర్వేచేసి ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా నిధులు దుర్వినియోగానికి కారకులవుతున్నారు. హుస్నాబాద్‌ మండలంలోని 17 పంచాయతీల్లో సర్వే చేసిన అధికారులు 1180 ఎకరాల భూమిని సాగుకు యోగ్యం కానిదిగా గుర్తించారు. ప్రభుత్వం మొదట మండలానికి ఒక గ్రామాన్ని ఎంపికచేసి నాలుగు సంక్షేమ పథకాలను వందశాతం అమలుచేయాలని నిర్ణయం తీసుకుంది. హుస్నాబాద్‌ మండలంలో తోటపల్లి గ్రామాన్ని ఎంపికచేసి జనవరి 26న అధికారులు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలకు లబ్ధిదారుల జాబితాలను ప్రకటించి మంజూరు పత్రాలను అందించారు. మరుసటి రోజు రెవెన్యూ గ్రామ పరిధిలోని తోటపల్లి, గాంధీనగర్‌, పూసలపల్లె, కిషన్‌నగర్‌ రైతులకు ప్రభుత్వం రైతు భరోసా డబ్బులను జమచేసింది. తోటపల్లి రెవెన్యూ గ్రామంలో 2కి.మీల పొడవునా వివిధ సర్వే నంబర్ల నుంచి ఆర్‌ అండ్‌ బీ రోడ్డు వెళుతోంది. దాదాపు ఆరు ఎకరాల వరకు రోడ్డు రైతుల పట్టాలోనే ఉంది. గ్రామాల్లోని నివాసాలు ఏర్పాటు చేసుకున్న భూములు కూడా ఇతర రైతుల పేరున ఉంది. గతంలో రైతు బంధు తీసుకున్నా ఇప్పుడు అదే పరిస్థితి నెలకొంది. రహదారికి పక్కనే పరిశ్రమలను ఏర్పాటు చేసిన భూములకు సైతం అధికారులు రైతు భరోసా ఇచ్చారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సన్న, చిన్నకారు రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమకు పశువుల పాకలను నిర్మాణం చేసుకున్న భూములను అధికారులు తొలగించారు. పెద్ద భూస్వాములు, రిటైర్డు ఉద్యోగులు వ్యవసాయ భూమిలో 0–20 గుంటల విస్తీర్ణంలో నివాసాలు నిర్మించిన వాటిని తొలగించలేదు. తోటపల్లి రెవెన్యూ పరిధిలో దాదాపు 30 ఎకరాల వరకు సాగుకు యోగ్యంకాని భూములకు రైతు భరోసా ఇవ్వడంతో రూ.1.80 లక్షల ప్రభుత్వ నిధులు వృథా కావడానికి వ్యవసాయ అధికారులే కారణమని రైతులు ఆరోపిస్తున్నారు.



తోటపల్లిలో సర్వే నంబరు 153లో నిర్మించిన ఇల్లు

ఉమ్మాపూర్‌ రెవెన్యూ పరిధిలో వందల ఎకరాల్లో గుట్టలు

హుస్నాబాద్‌ మండలంలోని ఉమ్మాపూర్‌, పోతారం(ఎస్‌), నాగారం, మీర్జాపూర్‌ గ్రామాల్లో వందల ఎకరాల భూముల్లో గుట్టలు ఉన్నా గతంలో రెవెన్యూ అధికారులు ఇష్టారీతిగా అసైన్డ్‌ పట్టాలు ఇచ్చారు. గుట్టలకు పట్టాలు ఎవరు ఇచ్చారని రెవెన్యూ అధికారులే విస్మయం వ్యక్తం చేసినా ఇప్పుడు సాగుకు యోగ్యం కాని భూముల్లో ఇక్కడి గుట్టల భూములు చాలా వరకు లేవు, ఇటుక బట్టీలు, సిమెంట్‌ బ్రిక్స్‌ పరిశ్రమలు, పోతారంలో ఏర్పాటు చేసి అనుమతి లేని లే ఔట్‌ భూములు కూడా రైతు భరోసా అర్హుల జాబితాలో ఉన్నట్లు ఆయా గ్రామాల రైతులు చెప్తున్నారు. రోడ్లు, భవనాలు, పరిశ్రమలు, గుట్టల భూములను అధికారులు గుర్తించి రైతు భరోసా జాబితా నుంచి తొలగించాలని డిమాండ్‌ చేస్తున్నారు.

వ్యవసాయ భూముల్లో ఇళ్లు



వ్యవసాయ భూముల్లో చాలా మంది 10 నుంచి 20 గుంటల విస్తీర్ణంలో ఇళ్లు నిర్మించినా ఒకే సర్వే నంబరులో ఉండటం వల్ల వాటిని తొలగించలేదు. 2 గుంటలు, 4 గుంటలు ఉన్న చిన్న నంబర్లను తొలగించినా రైతులు సాగు భూములని చెప్పారు. మళ్లీ నమోదు చేయడానికి సైట్‌ క్లోజ్‌ కావడంతో చిన్న రైతులకు నష్టం జరిగింది. మరో పంటకు అవకాశం ఉంటే నమోదు చేస్తాం. వ్యవసాయ భూముల్లో ఇళ్ల నిర్మాణం కింద ఉన్న భూములను కలెక్టర్‌ ఆదేశాల మేరకు తొలగిస్తాం.

– నాగరాజు, మండల వ్యవసాయ అధికారి, హుస్నాబాద్‌

రైతులకు విజ్ఞప్తి మేరకు..



వ్యవసాయ అధికారుల సహకారంతోనే సాగుకు యోగ్యంకాని భూములను గుర్తించినా కొందరు వాటిని సాగు భూములని చెప్పడంతో దరఖాస్తులు తీసుకుంటున్నాం. క్లస్టర్‌వారీగా వ్యవసాయ అధికారులు సాగు భూములను నమోదు చేసుకొంటే అనర్హులను తొలగించడం సులభంగా ఉంటుంది. ఏఈఓల దగ్గర సాగు భూముల వివరాలు లేనప్పుడు అర్హులకు అన్యాయం జరుగుతుంది.

– రవీందర్‌రెడ్డి, తహసీల్దారు, హుస్నాబాద్‌

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

- హత్యచేసి సాధారణ మృతిగా చిత్రీకరించారని ఆరోపణలు
- పోలీసుల అదుపులో మృతుడి భార్య



మృతుడి ఒంటిపై గాయాలను పరిశీలిస్తున్న పోలీసులు

వెల్దుర్తి(తూప్రాన్‌): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కాలనీవాసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కోటకింద కాలనీకి చెందిన ఆశల నర్సింలు (50) హమాలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. గతంలో రోడ్డు ప్రమాదంలో గాయపడి పక్షవాతం బారిన పడడంతో కొన్నేళ్లుగా మంచానికే పరిమితమయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం నర్సింలు ఇంట్లో మృతి చెందాడు. సాధారణ మృతిగా భావించి అంత్యక్రియలు జరపడానికి ఏర్పాట్లు చేసే క్రమంలో బంధువులు, కాలనీవాసులు మృతుడి భార్యను నిలదీశారు. శనివారం రాత్రి ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి తెల్లారేసరికి ఎలా శవమయ్యాడని ప్రశ్నించారు. అదేవిధంగా మృతుడి పేరిట ఉన్న భూమిని ఇటీవల విక్రయించగా సుమారు రూ. 22 లక్షల వరకు వచ్చాయని, వాటిని ఏం చేశావని ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు చెప్పింది. విషయం పోలీసుల వరకు వెళ్లడంతో ఇన్‌చార్జి ఎస్‌ఐ మధుకర్‌ సంఘటనాస్థలిని సందర్శించి మృతుడి భార్య ఎల్లమ్మను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌ తరలించారు. తూప్రాన్‌ సీఐ రంగా కృష్ణ మృతుడి ఒంటిపై గాయాలు, గదిని పరిశీలించారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తూప్రాన్‌ ఏరియా ఆసుపత్రికి తరలించామని తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి విచారణ చేపడతామన్నారు. అయితే వివాహేతర సంబంధం నేపథ్యంలో మృతుడి భార్య మరో యువకుడితో కలిసి హత్య చేసి సాధారణ మరణంగా చిత్రీకరించిందని ఆరోపణలు వెల్లువెత్తాయి.

తల్లి, కుమారుడి అదృశ్యం

- వారం క్రితం మరొకరు..
- మిస్టరీపై గ్రామస్తుల అనుమానాలు



యాదమ్మ



రుత్విక్‌

రామాయంపేట(మెదక్‌): మండలంలోని లక్ష్మాపూర్‌ గ్రామంలో తల్లీ, కుమారుడు అదృశ్యమయ్యారు. ఎస్‌ఐ బాలరాజు కథనం మేరకు.. గ్రామానికి చెందిన అనుముల యాదమ్మ (30), ఆమె కుమారుడు రుత్విక్‌ (10) గత నెల 29న ఇంటి నుంచి వెళ్లిపోయారు. కుటుంబ సభ్యులు వారిద్దరి ఆచూకీ కోసం ఎంత ప్రయత్నించినా ఫలితం లేదు. దీంతో యాదమ్మ తల్లి బాగవ్వ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగా వారం క్రితం అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి అదృశ్యం కాగా, వీరి ముగ్గురి అదృశ్యం వెనుక మిస్టరీ ఉందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతి



స్వామి (ఫైల్‌)

రామాయంపేట(మెదక్‌): రామాయంపేట పట్టణ శివారులో ఆదివారం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన పోచమ్మల స్వామి (55) బైక్‌పై రామాయంపేట వైపు వస్తుండగా, ఎదురుగా వస్తున్న మరో వ్యక్తి తన బైక్‌ను కుడివైపున ఉన్న పెట్రోల్‌ పంపు వైపు మలుపుతున్న క్రమంలో రెండు బైక్‌లు బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన స్వామిని చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందాడు. కాగా గాయపడిన మరొకర వ్యక్తి వివరాలు తెలియరాలేదని ఎస్‌ఐ బాల్‌రాజ్‌ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు ప్రమాదంలో..

నర్సాపూర్‌ రూరల్‌: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన నర్సాపూర్‌- వెల్దుర్తి రహదారిలో చోటుచేసుకుంది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేట మండలం టిక్యాతండాకు చెందిన నేనావత్‌ ఆంజనేయులు (42) నర్సాపూర్‌ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌ జరుగుతున్న బంధువుల పెళ్లికి హాజరయ్యేందుకు బైక్‌పై బయలుదేరాడు. మరికొన్ని నిమిషాల్లో పెళ్లి మండపానికి చేరుకునే వాడు. అయితే ఫంక్షన్‌హాల్‌ సమీపంలో ఎదురుగా వచ్చిన బోర్‌ డ్రిల్లింగ్‌ వాహనం ఢీకొట్టింది. దీంతో ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడే ఉన్న భార్య లలిత, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని నర్సాపూర్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ఆంజనేయులు (ఫైల్‌)

డివైడర్‌ను ఢీకొని..

దుబ్బాకరూరల్‌: ఎదురుగా వచ్చిన పందిని ఢీకొట్టి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన అక్బర్‌పేట భూంపల్లి మండలం పోతారెడ్డిపేట వద్ద చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరీశ్‌ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాచకొండ యాదగిరి శనివారం రాత్రి ఎనిమిది గంటలకు తన కుటుంబ సభ్యులతో బైక్‌పై కూడవెల్లి జాతరకు వెళ్లాడు. భార్య, పిల్లలను జాతరలో వదిలి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో పోతారెడ్డిపేట సబ్‌ స్టేషన్‌ వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన పందిని తప్పించే క్రమంలో డివైడర్‌ను ఢీకొట్టాడు. అతడిని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్‌: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం .. అమీన్‌పూర్‌ మున్సిపల్‌ పరిధిలోని నర్రెగూడెంలో నివాసం ఉండే ఉపేందర్‌ ఎనిమిది సంవత్సరాల క్రితం ఖమ్మంకు చెందిన మౌనికను వివాహం చేసుకున్నాడు. వివాహం జరిగిన కొద్ది రోజుల నుంచే గొడవలు జరుగుతూ ఉండేవి. ఈ క్రమంలో మౌనిక మూడు సంవత్సరాల క్రితం భర్త ఉపేందర్‌ను వదిలేసి తల్లిగారి ఇంటికి వెళ్లిపోయింది. వెళ్లి అక్కడ పోలీస్‌స్టేషన్‌లో భర్తపై ఫిర్యాదు చేసింది. అయితే ఒంటరిగా ఉన్న ఉపేందర్‌ జనవరి 21న జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే హైదరాబాద్‌ నిమ్స్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజ్ఞాపూర్‌లో..

గజ్వేల్‌రూరల్‌: పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగులపల్లి సంతోష్‌ (35) ట్రాక్టర్‌ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుకునూర్‌పల్లికి ఇల్లరికం వెళ్లిన సంతోష్‌ ఏ పనిచేయకుండా మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ కలహాలతో శనివారం రాత్రి ప్రజ్ఞాపూర్‌ వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రాత్రి మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్‌ పోలీసులు తెలిపారు.

తైబజార్‌ వసూలు దారులపై దాడి

పలువురిపై కేసు నమోదు

దుబ్బాకటౌన్‌: గొర్రెలు, మేకల సంతలో తై బజార్‌ వసూలుచేసే ముగ్గురు కూలీలపై దాడిచేసిన వ్యాపారులపై కేసు నమోదు చేసిన ఘటన దుబ్బాకలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ వి.గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మాల కుంటలో ప్రతి శనివారం సంత నిర్వహిస్తారు. ఈ క్రమంలో శనివారం రుసుము వసూలు చేస్తున్న క్రమంలో కూలీలు శ్రీధర్‌, రాకేశ్‌, గోపీలపై వ్యాపారులైన పర్వతాలు, ధారబోయిన ఉప్పలయ్య, రాజల్లుతో పాటు మరి కొంత మంది దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు కూలీలకు గాయాలయ్యాయి. గాయపడ్డ శ్రీధర్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి దారుణహత్య



మృతదేహం వద్ద ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌ టీం

శివ్వంపేట(నర్సాపూర్‌): వ్యక్తి దారుణహత్యకు గురైన సంఘటన మండల పరిధిలోని టిక్యా దేవమ్మగూడెం పంచాయతీ పరిధి సామ్య తండాలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన మదన్‌లాల్‌నాయక్‌ (38) ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. అదివారం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో గుర్తించిన తండా వాసులు లోనికి వెళ్లి చూడగా మదన్‌లాల్‌ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో పొడిచి హత్యచేశారని.. ఇది తెలిసిన వారి పనేనని మృతుడి బంధువులు ఆరోపించారు. మదన్‌లాల్‌ తండ్రి హీరాలాల్‌ మూడేళ్ల క్రితం, తల్లి రాజమణి ఏడాది క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. ఇంట్లో గొడవలు చోటుచేసుకోవడంతో మూడేళ్ల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మదన్‌లాల్‌ వ్యవసాయం చేసుకుంటూ ఒక్కడే తండాలో ఉంటున్నాడు. సంఘటనా స్థలాన్ని తూప్రాన్‌ సీఐ రంగాకృష్ణ, ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి, క్లూస్‌ టీం, డాగ్‌ స్క్వాడ్‌ బృందం పరిశీలించి ఆధారాలు సేకరించారు. హత్యకు పాల్పడిన వారిని త్వరలోనే గుర్తించి పట్టుకుంటామని సీఐ తెలిపారు.

భగ్న ప్రేమికుడి బలవన్మరణం



ప్రశాంత్‌ (ఫైల్‌)

కొండపాక(గజ్వేల్‌): ఓ భగ్న ప్రేమికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కొండపాకలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్‌ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ప్రశాంత్‌(29) బీఈడీ పూర్తి చేసి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. శనివారం రాత్రి బయటకు వెళ్తున్నానని తండ్రి ఎల్లయ్యకు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం తమ వ్యవసాయ పొలం వద్ద పాలు పితికేందుకు వెళ్లిన ఎల్లయ్యకు సమీపంలోని చింతచెట్టుకు ప్రశాంత్‌ వేలాడుతూ విగతజీవిగా కనిపించడాన్ని చూసి కంగుతున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. అనంతరం సెల్‌ఫోన్‌ను పరిశీలించగా.. ప్రేమించిన అమ్మాయి దక్కలేదని మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లుగా తాము భావిస్తున్నామని ఎల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రశాంత్‌ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అంత్యక్రియలకు వెళ్లి.. అనంతలోకాలకు



మల్లేశం (ఫైల్‌)

చిన్నశంకరంపేట(మెదక్‌): బంధువు అంత్యక్రియలకు వెళ్లిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన నార్సింగి మండలం శేరిపల్లిలో విషాదం నింపింది. గ్రామానికి చెందిన చెన్నగారి మల్లేశం (46) కామారెడ్డి పట్టణంలో బంధువు మృతి చెందడంతో శనివారం వెళ్లాడు. అంత్యక్రియలు ముగిసిన అనంతరం రాత్రి సమయంలో బైక్‌పై ఇంటికి బయలుదేరగా దేవునిపల్లి రహదారిపై ఎదురుగా వచ్చిన మరో బైక్‌ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

పట్టపగలే బైక్‌ చోరీ

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం ఊట్ల శివారులో పార్కు చేసిన బైక్‌ చోరీకి గురైంది. గ్రామానికి చెందిన ఆంజనేయులు ఆదివారం ఉదయం తన షాపు వద్ద పార్కు చేశాడు. ఉదయం 11 గంటల సమయంలో బైక్‌ చోరీకి గురైంది. దీంతో పోలీసులను ఆశ్రయించాడు. సీసీ కెమెరాలు పరిశీలించగా.. జంగంపేట వైపు ఓవ్యక్తి బైక్‌ తీసుకెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి.

భక్తుల కొంగుబంగారం

4 నుంచి మహంకాళి దేవి ఆలయంలో ఉత్సవాలు

ఆలయ కమిటీ భారీ ఏర్పాట్లు ● పెద్ద ఎత్తున హాజరుకానున్న భక్తులు

మహంకాళిమాత ఆలయం





ఆలయంలో కొలువై ఉన్న మహంకాళమ్మ

దుబ్బాక: భక్తులకు వరాలిచ్చే మహిమగల దేవతగా దుబ్బాక పట్టణంలో కొలువైన మహంకాళమ్మ ప్రసిద్ధి. పట్టణంలోని చీకోడ్‌ వెళ్లే బైపాస్‌ రోడ్డులో గత ఎనిమిదేళ్ల క్రితం మహంకాళమ్మ ఆలయాన్ని అన్ని హంగులతో అద్భుతంగా నిర్మించారు. అనతికాలంలోనే ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువైంది. ఆలయం ఎనిమిదవ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

రేపటి నుంచి ఉత్సవాలు

గ్రామ దేవతగా కొలుచుకుంటున్న మహంకాళి ఆలయంలో ఎనిమిదో వార్షికోత్సవాలు మంగళవారం ప్రారంభం అవుతాయి. పట్టణంలోని రెడ్డి, మున్నూరు కాపు సంఘాలతో పాటు ఇతర భక్తులు ఉత్సవాలు నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం 8 గంటలకు ఆలయంలో మహంకాళమ్మకు మహాభిషేకం అలంకరణతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. ఈ సందర్భంగా ముందుగా గణపతి పూజ, పుణ్యాహావాచనం, అమ్మవారికి పంచామృతాభిషేకము, అలంకరణ, ఉదయం 9 గంటల నుంచి సువాసినిలచే సామూహిక కుంకుమార్చన, అమ్మవారి మూలమంత్ర హవనం, పూర్ణాహుతి, మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ, అన్నదానం కార్యక్రమాలు ఉంటాయి. కాగా, ఉత్సవాల సందర్భంగా గురుమాధవానంద సరస్వతి స్వామిజీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తారు.

ప్రముఖుల రాక

ఉత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వేదపండితులు వేలేటి జయరామశర్మ, రామకృష్ణ శర్మల ఆధ్వర్యంలో వైదిక నిర్వహణ జరుగుతుంది. ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో తగు ఏర్పాట్లు చేశారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



మహంకాళమ్మ ఉత్సవాల సందర్భంగా ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా అన్ని ఏర్పాట్లు చేశాం.

–గన్నె బుచ్చిరాజంరెడ్డి, ఆలయ కమిటీ బాధ్యులు